నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, నవంబర్ 25 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ వీబీఆర్ఐ,11 కేవీ ఇలియాస్ రోడ్,11 కేవీ అఫ్జల్‌సాగర్ ఫీడర్ల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

వీబీఆర్ఐ, నైస్ హాస్పిటల్, ఐటీఐ, మల్లేపల్లి, ఏ – బ్యాటరీ లైన్, విజయ్‌నగర్ కాలనీ, లక్ష్మీనగర్, హుస్సేని మసీద్, పోలీస్ క్వార్టర్స్, ఏసీ గార్డ్స్, ఎస్‌బీఐ బ్యాంక్, ఐడీబీఐ క్వార్టర్స్, ఏషియన్ అపార్టుమెంట్, బజార్‌ఘాట్ చర్చి, ఏ – బ్యాటరీ లైన్, బిలాల్ మసీద్, అపెక్స్ ప్రింటింగ్ ప్రెస్, శాంతినగర్ పోలీస్ క్వార్టర్స్, పిక్చర్ హౌస్, గోకుల్‌నగర్, గ్లోరి థియేటర్, శాంతినగర్, లక్డీకాపూల్, మున్సిపల్ కమిషనర్ కార్యాలయం, గంగా జమున హోటల్ ప్రాంతాలు

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

బడీ మసీద్, ఫుట్‌బాల్ గ్రౌండ్, జాఫర్ గ్రౌండ్, అన్వర్ ఉలూం కాలేజీ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

చెట్టుకొమ్మలు కొట్టేసిన ఇంటి యజమాని

● అడ్డుకున్న హార్టికల్చర్ అధికారులు

నల్లకుంట శంకరమఠం వెళ్లే దారిలో వ్యాపార సముదాయం కోసం బిల్డింగ్ నిర్మాణం చేపట్టారు. అది పూర్తయ్యే దశలో ఉన్నది. దాని ముందు రెండు చెట్లు ఉండటంతో వాటిని నరకడం మొదలుపెట్టారు. ఈ విషయమై హార్టికల్చర్ అధికారులకు ఫిర్యాదు అందడంతో అంబర్‌పేట సర్కిల్ సూపర్‌వైజర్ ఫయాజ్ అక్కడకు వచ్చి చెట్లను కొట్టడం ఆపివేశారు. ఎవరైనా చెట్లును కొట్టాలంటే ముందుగా అటవీశాఖ నుంచి అనుమతి తీసుకోవాలని తెలిపారు. అనుమతి లేనిదే చెట్టును కొట్టకూడదని ఆయన చెప్పారు.

- అంబర్‌పేట

జీహెచ్ఎంసీ దుకాణాల టెండర్లు రద్దుచేయాలి

గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్

సుల్తాన్‌బజార్, నవంబర్ 25 : కోఠిలోని కామత్ హోటల్ ప్రక్కన ఉన్న జీహెచ్ఎంసీకి చెందిన 14 దుకాణాలకు అక్రమంగా ఇచ్చిన టెండర్లను రద్దు చేసి రూల్స్ ప్రకారం టెండర్లు పిలవాలని అధికారులకు మెమోరాండాలను సమర్పించినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. సోమవారం గౌలిగూడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కామత్ హోటల్ ప్రక్కన ఉన్న 14 షాపులను అక్రమంగా పాత వారికి తక్కువ అద్దెకు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ విషయమై ఫిబ్రవరి నుంచి ముగ్గురు జీహెచ్ఎంసీ కమిషనర్లకు ప్రజావాణిలో, అడిషనల్ కమిషనర్ ఎస్టేట్, పాత ఎస్టేట్ ఆఫీసర్ బాషా, జీహెచ్ఎంసీ సర్కిల్ 14 డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌కు రూల్స్ ప్రకారం నూతనంగా టెండర్లను నిర్వహించాలని పలుమార్లు మెమోరాండాలను సమర్పించినా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. పలుచోట్ల తనిఖీలు చేపడుతున్న నగర జీహెచ్ఎంసీ మేయర్ పేదల కడుపుకొడుతున్న మున్సిపల్ అధికారుల తీరును గమనించి అక్రమ టెండర్ ఫైల్‌లో వాస్తవాలను తెలుసుకొని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఖజానాకు నష్టం..

రెండు పర్యాయాలు టెండర్ చేపట్టిన సమయంలో నగర వ్యాప్తంగా ఎంతో మంది టెండర్లు వేయడానికి వచ్చారని ఆయా దుకాణాలలో కొనసాగుతున్న వారు గొడవ చేసి టెండర్‌ను నిలిపివేశారన్నారు. అనంతరం వచ్చిన అధికారులకు లంచాలు ఇచ్చి వారి కుటుంబంలోనే ముగ్గురు, నలుగురికి షాపులు వచ్చే విధంగా చేశారని ఆయన ఆరోపించారు. గతంలో ఉన్న షాపుల అద్దె కంటే రెండు, మూడు వందలు పెంచి షాపులను దక్కించుకున్నారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ అధికారులు టెండర్లను రద్దు చేసి నూతన టెండర్లను వేయకపోతే అవినీతి అధికారుల బండారాన్ని బయటపెడుతామని ఆనంద్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. 14 షాపులలో కేవలం ఇద్దరు మాత్రమే షాపులు నడుపుతున్నారని, మిగిలిన 12 షాపుల వాళ్లు రూ.80 వేలకు షాపు లను సబ్ లీజ్‌కు ఇచ్చి జీహెచ్ఎంసీకి కేవలం రూ.18 వేలు కడుతూ ప్రభుత్వ ఖజానాకు నష్టం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు రూల్స్ ప్రకారం నడుచుకోవాలని లేని పక్షంలో పది రోజుల్లో బీఆర్ఎస్ తరపున భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజయ్ ముదిరాజ్, మహేశ్‌గౌడ్, నరేశ్ పాల్గొన్నారు.

గౌలిగూడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్

జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట, నవంబర్ 25 : అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కార్తిక మాసాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి శక్తి పీఠం జోగులాంబ అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కార్పొరేటర్లు ఈ. విజయ్‌కుమార్‌గౌడ్, బి. పద్మావెంకట రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సిద్ధార్థ్ ముదిరాజ్, మేడి ప్రసాద్, భీష్మాదేవ్ తదితరులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ మహిళలకు పసుపు, బొట్టు, కానుకలు ఇచ్చారు. అందరూ కలిసి కార్తిక వన భోజనాలు చేశారు.

నేడు జురిస్ట్, సేవారత్న అవార్డ్స్ 2024 కార్యక్రమం

సుల్తాన్‌బజార్, నవంబర్ 25: ఈ నెల 26న జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జురిస్ట్, సేవారత్న అవార్డ్స్ 2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ సోమవారం తెలిపారు. 26న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లా ప్రొఫెసర్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాల క్రిష్ణారెడ్డి, ఎంఎల్‌సీ బుగ్గారపు దయానంద్, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నారాయణ, జుడీషియల్ ఆఫీసర్ స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషన్ ఆర్టీ జడ్జి టి. గోపాల్ సింగ్, మాజీ హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్లు డీఎల్ పాండు పాల్గొంటారని తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా హైకోర్టు న్యాయవాదులు స్వదేశ్, అయోధ్యసాయి చక్రవర్తి, వి. శత్రునాయక్, గడ్డగుట్టి ఎట్టయ్య, డి. రాజిరెడ్డి, కానాపురం అమూల్య, ముస్తఫా అహ్మద్ అమీర్‌లను జురిస్ట్ అవార్డుతో, ఎల్‌సీ గోపయ్య, ఎస్ దీపక్ రాజ్, జి. వీరమ్మ, కెప్టెన్ డాక్టర్ మడుగు విజయంకుమార్, గడిమల్లి శ్రీనివాస్, దీపాంకర్ పాల్, రుద్రారం అంజయ్య ముదిరాజ్, డాక్టర్ పి. శ్యామ, చంద్రయ్యలకు సేవారత్న పురస్కారాలను ప్రదానం చేసి శాలువా, మెమెంటోలతో సన్మానిస్తారని తెలిపారు.

చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన ప్రొ.సూర్య ధనుంజయ్‌ను సోమవారం ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ఎస్ఓ ప్రొ. కె. సరస్వతమ్మ, సోషియాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ రవి కుమార్, ఆయిస్టర్ సంస్థ రాష్ట్ర కార్యదర్శి షేక్ సోహైల్, వర్సిటీ ఆయిస్టర్ యూనిట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రిషిక, సభ్యులు భువన, భవాని, అనన్య, యోగిత పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్

నేడు బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ సమావేశం

● హాజరుకానున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జూబ్లీహిల్స్/బంజారాహిల్స్, నవంబర్ 25 : బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గాల సమావేశం జరగనుంది. సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించనున్న ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల అనంతరం నిర్వహిస్తున్న ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకోనుంది. తెలంగాణ భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, మాజీ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు హాజరుకావాలని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఒక ప్రకటనలో కోరారు. అలాగే.. ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తున్నామని నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి తెలిపారు. పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కార్మికుల హక్కులను కాపాడుకోవాలి

హిమాయత్‌నగర్, నవంబర్ 25 : కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏండ్ల తరబడి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని, వారికి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కార్మికవర్గం ఐక్యతతో ముందుకు సాగి హక్కులను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అబిడ్స్, నవంబర్ 25 : నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ కార్పొరేటర్‌లు జి. శంకర్‌యాదవ్, రాకేశ్‌జైస్వాల్, ఎం. శశికళ క్రిష్ణలతో కలిసి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. బేగంబజార్‌లోని తోప్ ఖానా స్టామ్ వాటర్ లైన్, మంగళహాట్ డివిజన్ పరిధిలోని గుఫానగర్, చెన్నయ్య బస్తీ సీసీరోడ్డు పనులు, కాగజ్‌గుడా, సత్తన్న గల్లీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి. గణేశ్‌యాదవ్, ఆల పురుషోత్తంరావు, డి. శేఖర్, మయూర్‌కాలేకర్, గోపాల్, గొడగు శ్రీనివాస్‌యాదవ్, రవీందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదుచేయించుకోవాలి

జూబ్లీహిల్స్, నవంబర్ 25: ఓటరు నమోదు ప్రాధాన్యతపై మంగళవారం యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు నుంచి అవగాహన ర్యాలీ చేపట్టనున్నట్లు యూసీడీ డీపీఓ వెంకటకిషన్ రావు తెలిపారు. 2025, జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండనున్న యువతీ యువకులు ముందుగా తమపేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రధానంగా ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారుతున్న వారు చిరునామాలు మార్పు చేయించుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతన ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు స్పెషల్ సమ్మరి రివిజన్ చేపడుతున్నామని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జా కియా సుల్తానా తెలిపారు. ఇందులో భాగంగా అర్హులందరూ తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈనెలాఖరు వరకు నూతన ఓటరు నమో దు, సవరణలు చేపడుతున్నందున.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంజారాహిల్స్ రోడ్ నం.14లో ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్

బంజారాహిల్స్,నవంబర్ 25: బంజారాహిల్స్ రోడ్ నం.14లోని నందీనగర్ నుంచి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లేదారిలో వెలిసిన రోడ్డు ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు 'అపరేషన్ రోప్' కార్యక్రమంలో భాగంగా సోమవారం తొలగింపు ప్రక్రియను చేపట్టారు. టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు, పండ్ల వ్యాపారాలు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండడంతో పాటు వాహనాలు పార్క్ చేస్తుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతుండడంతో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల వారికి హెచ్చరికలు జారీ చేశారు. అ యినప్పటికీ పద్ధతి మార్చుకోకపోవడంతో వాటిని తొలగించారు. మరోసారి రోడ్డు ఆక్రమణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తా మని ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ హెచ్చరించారు.

పైప్‌లైన్‌కు లీకేజీ.. వృథాగా మంచినీరు

చిన్న అనంతగిరి దేవాలయం ప్రాంతంలో రోడ్డుపై వృథాగా పోతున్న మంచినీరు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 25: అత్తాపూర్ డివిజన్, చిన్న అనంతగిరి శివాలయం ప్రాంతంలో మంచినీరు గత రెండు రోజులుగా వృథాగా పోతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు. రాజేంద్రనగర్ జల మండలి అధికారులకు ఫోన్‌లు చేసి ఫిర్యాదు చేస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. లీకేజీ ఏర్పడిన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని అన్నారు. కొన్ని కాలనీలకు, బస్తీలకు నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులకు కనిపించడం లేదా అని అంటున్నారు. పైపులైన్ పగిలిపోవడంతో దాదాపు మూడు కిలోమీటర్ల మేర ఈ నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు చెక్కుల పంపిణీ

సికింద్రాబాద్, నవంబర్ 25: మధురానగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నేడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ పంపిణీ చేస్తారని క్యాంపు కార్యాలయ అధికారులు సోమవారం ఒక పక్రటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధుడు మృతి

కాచిగూడ, నవంబర్ 25: రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(60) శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం–2 చివర్లో అనారోగ్యంగా ఉంటూ సోమవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి ఒంటిపై కాకి చొక్క, గోధుమ రంగు ట్రాక్ ప్యాంట్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్పెషల్ రైల్లో దొంగతనం

కాచిగూడ, నవంబర్ 25: స్పెషల్ రైల్లో ప్రయాణికురాలి నగదు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. హరిపురికాలనీకి చెందిన ఆర్.నాగమణి కాచిగూడ స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా తాటిచెర్ల రైల్వేస్టేషన్ సమీపంలో బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న రూ.10 వేలు, ఖరీదైన పోన్, ఏటీఎం కార్డు, ఆధార్‌కార్డు కన్పించలేదు. సోమవారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం అనంతపూర్ రైల్వేస్టేషన్‌కు బదిలీ చేసినట్లు కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

చిక్కడపల్లి, నవంబర్ 25: సామాజికంగా వెనుకబడిన వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర్ల ఆత్మ గౌరవ భవన సముదాయ ట్రస్ట్– తెలంగాణ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ రాజు సోమవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, శివరాత్రి అంజయ్య, రాములు, నాగరాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాలకు అన్యాయం

మహా ధార్నకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ తదితరులు

చిక్కడపల్లి, నవంబర్ 25: కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాలు ఇబ్బందులు పడుతున్నారని, ఎవ్వరూ కూడా సంతోషంగా లేరని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. దళిత, గిరిజనుల పక్షాన బీఆర్ఎస్ పోరాటంలో భాగంగా సోమవారం మానుకోటలో మహాధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ నేత ముఠా జయసింహ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ధార్నకు రతలివెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లగచర్ల గిరిజన రైతుల పక్షాన ముందుండి పోరాడుతున్నారని చెప్పారు. ఫార్మా పేరుతో ప్రభుత్వం గిరిజనుల భూమి లాక్కోవడానికి ప్రయత్నం చేయడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, శివముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, నితిన్, అరుణ్, సాయి చాణిక్యరెడ్డి, సత్యనారాయణ, అనిల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 25 : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ వెల్లడించారు. సోమవారం దుర్గానగర్, రాజేంద్రనగర్, పల్లెచెరువు, తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఉల్లంఘనలను నివారించడానికి, ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడానికి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్ల మధ్యలో ఉన్న చిన్న చిన్న టర్నింగ్‌లను మూసివేయించారు. అలాగే వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. అనంతరం రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఆరాంఘర్ చౌరస్తాలోని బస్టాప్‌ను పరిశీలించారు. బస్టాప్‌ను అనువైన ప్రాంతానికి మార్చేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ .. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మట్‌ను తప్పకుండా ధరించాలన్నారు. అలాగే కార్లలో సీటు బెల్ట్ వేసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు అని వారు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాల యజమానులతో పాటు కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరాంఘర్ చౌరస్తాలో అధికారులతో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

మంచినీటి సౌకర్యం కల్పించాలి

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 25: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు ఎస్.వెంకటేశ్ కోరారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని పలు కాలనీల్లో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన .. సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. కాలనీల్లో మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడు తున్నారన్నారు. 20 సంవత్సరాల నుంచి ఈ బస్తీల్లో 150 కుటుంబాలు మంచినీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలనీలకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని ఇప్పటికే అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని కలుషితమైన నీరు తాగుతూ రోగాలబారినపడి ఆసుపత్రి పాలవుతున్నారన్నారు. దుర్గా కన్వెన్షన్ ప్రాంతంలో మంచినీటి పైపులైన్ వేసి ప్రజల కష్టాలను తీర్చాలని కోరారు.

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్

నాలాపై కప్పు నిర్మించాలి..

దుర్గా కన్వెన్షన్ పక్క నుంచి వెళ్తున్న మురికి ఓపెన్ నాలాపై కప్పు నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని , వెంటనే నాలాపై కప్పు నిర్మించాలని బీఆర్ఎస్ నేత వెంకటేశ్ కోరారు. కాలనీ ప్రజలకు రహదారి లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు దుర్గా కన్వెన్షన్ ఎదురుగా ఉన్న కాలనీ ప్రజలకు నాలాపై కప్పు వేసి కాలనీ ప్రజలకు రహదారి కల్పిస్తే కాలనీ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడానికి కృషి చేస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఆసిఫ్‌నగర్ మండలం పరిధిలో మంజూరైన 427 షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే, తాసీల్దార్ జ్యోతి, ఎంఐఎం కార్పొరేటర్లు షేక్‌ఖాసీం, జాఫర్ ఖాన్, సర్పరాజ్ సిద్ధిఖీ, ఎండీ మూసాతో కలిసి అందజేశారు.

- మెహిదీపట్నం

రోడ్డు కోసం స్థలం వదలండి

నడవడానికి రోడ్డు కోసం స్థలం కావాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ హెచ్ఎండీఏ అధికారులకు సూచించారు. సోమవారం హకీంపేట్‌లో హెచ్ఎండీఏ నిర్మించనున్న ప్రహరీ ప్రాంతాన్ని షేక్‌పేట్ తాసీల్దార్ వై.అనితారెడ్డి, హెచ్ఎండీఏ అధికారులతో ఎమ్మెల్యే సందర్శించారు. అధికారులు ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టడానికి ముందు స్థానికుల రాకపోకల కోసం స్థలం కేటాయించాలన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్థలం వద్దకు రావాలన్నారు.

- మెహిదీపట్నం

అస్తవ్యస్తంగా స్లాటర్‌హౌస్

కాచిగూడ : స్లాటర్‌హౌస్‌లో సౌకర్యాలు కల్పించడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని కాచిగూడ స్లాటర్ హౌస్ కబేళా అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్.రమేశ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు గోపాల్‌రావు అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎక్కడాలేని విధంగా కాంట్రాక్టర్ రోజుకో రూల్స్ పెడుతున్నారని, మండీదార్లు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్టర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నార